

# టేకిట్ ఈజీ!! - 2

శ్రీనివాస ఫణికుమార్ డొక్కా



# బిగ్ వుమెన్ అండ్ బీచ్ టవల్ పార్టీ

స్టాండిగ్ షవర్ జల్లులలో తడిసి ముద్దైపోతూ, షాంపూ అంతా అవగొట్టేస్తున్నాడు బుల్లబ్బాయి. సబ్బుతో తోమినంతమేర తోమి, ఆనక చేతులు పైకెత్తేసి, అలవోకగా పాటందుకున్నాడు "ఆగదూ...ఆగదూ..ఆగితే..."" అంటూ.

"మీ అఘాయిత్యం కూల, ఎక్కడున్నారు? ఏంచేస్తున్నారు" అంది మిసెస్ బుల్లబ్బాయ్, అవతలి రూమ్ లోంచి గేట్టిగా.

"షవర్లో...స్నానం" అని అరిచి "ఆగదూ...ఆగదూ..." అంటూ పిండుకుంటూ కంటిన్యూ చేసాడు.

ఇంక ఆవిడకి ఆగలేదు. అధాట్టున పరిగెత్తుకొచ్చి చూసి,

"అంత ఆగకపోతే, ఆ పనయ్యాకే చెయ్యచ్చుగా స్నానం, మళ్ళీ అనుమానం లేకుండా ఉంటుంది" అంది విసుగ్గా.

కానీ ఇవేవీ వినే పరిస్థితిలో లేడు బుల్లబ్బాయి. ఎంతో తన్మయత్వంతో బొజ్జ రాసుకుంటూ "మూకుడు నల్లనని,వేపుడు కర కర ని, తెలిసినా మా యావిడ తిట్టక మానదు " అంటూ చాలా ఫీల్ తో పాడుతున్నాడు.

ఆవిడ నిర్దాక్షిణ్యంగా షవరాపేసి, ఓ బొంతలాంటి తువ్వాలు బుల్లబ్బాయిమీద విసిరి, "ఇంక ఆపి బైటికి వస్తే, పాపం సబ్డివిజలో మిగితా వాళ్ళు స్నానం చేస్తారుట" అంటూ లాగింది.

అతనలాగే బైటికొచ్చి తయరై, "నువ్వు కూడా రావచ్చుగా పార్టీకి " అన్నాడు మెల్లిగా రిక్వెష్టు చేస్తూ.

" వెట్టీ కాదు వెంపరా కాదు, పంపర అన్నాట్ట మీలాంటివాడే వెనకటికి. ఎవరి పార్టీవో మీకు తెలీదు, ఏం పార్టీవో తెలీదు, ఏదో మీ ఫ్రెండు వచ్చి రికార్డులెయ్యమంటే ఎగేసుకుని వెళిపోతున్నారు. నాకు చిరాకు బాబూ, వెధవ తిండి కోసం వెంపర్లాడిపోవడం, ఏం మనింట్లో లేదా తిండి?" అంది కోపంగా.

"ఆ..నేనేం తిండి కోసం వెళటంలేదు. ఏదో పాపం మా ఫ్రెండు బోసు డీ.జే ఒప్పుకున్నాడు ఈ పార్టీకి మేళం పెడతానని. కానీ ఇవాళా వాడొచ్చేసరికి కాస్త లేటవుతుందని, నన్ను వెళ్ళి పాటలు వెయ్యమన్నాడు, వాడొచ్చేదాకాను. అయినా అ పార్టీ వాళ్ళు బంగాళ దుంపల వేపుడు చేయించటం లేదట, తెలుసా?" అన్నాడు బుల్లబ్బాయి బుంగమూతెట్టి.

"మీ ఖర్మ, అయినా మీకు తోడు ఆ బోసాకడు. అఘోరించండి, తేదీ మారేలోపు ఇంటికొచ్చి పడితే కాళ్ళకి దండవెట్టుకుంటాను, లేకపోతే ఏకంగా ఫొటోకే..." అనేసి కిందకెళ్ళి "జబర్దస్త్ నారి" గేం షోలో మునిగిపోయింది మిసెస్ బుల్లబ్బాయి.

బుల్లబ్బాయి కిందకి దిగి, కారు తీసి ఫోనులో ఎడ్రసు పెట్టి, ఎవరూ తెలియని పార్టీకి ఎక్స్ప్రెస్ స్పీడులో బయల్దేరాడు.

ఇంతలో బోసు ఫోను. "హలో, బుల్లబ్బాయ్, నేను సెట్టైట్టేసాను. ఇప్పుడింకో బేరం చూసుకుని రెండుగెంటల్లో వచ్చేత్తాను. నువ్వెళ్ళి పాటల్లన్నీ ఏసేసుకో. ఈలైతే ఒహట్రెండు పాడేయ్. ఈలోపులో నేనొచ్చేత్తాను. బేగా ఎళ్ళు...". ఫోను కట్జేసేసాడు.

"టేక్ "టి" టర్న్" అంటోంది ఫోను. అదెలా వుంటుందో అర్థంకాక, ఆలోచిస్తూ కారు తోలుతున్నాడు. ఓ అరగంట పోయాకా " యు హావ్ ఎరైవ్డ్" అంది ఫోను ముద్దుగా. చుట్టూ చూసాడు. ఓ పక్కన చర్చి, మరో పక్క సమాధులు తప్ప ఇంకేమీ కనపడలేదు. "కొంపతీసి బోసు గాడు చచ్చినోళ్ళకి కూడా మేళాలెడుతున్నాడా, చచ్చినోడు." అనుకుంటూండగానే మళ్ళీ ఫోను మోగింది.

"ఆ నేనేరా, ఎలావుంది పార్టీ" అన్నాడు బోసు.

"అదికాదురా, ఫోను చెప్పినచోటికొచ్చాను అక్కడ చర్చీ, స్మశానవూ తప్ప ఇంకేవీ లేవురా. నాకేదో భయంగా వుందిరా" అన్నాడు బుల్లబ్బాయి జాలిగా.

"ఓ అదా, అదీ...ఫోను తప్పు సూపిత్తందిరా. నువ్వు ఎళ్ళిన రోడ్డులోనే ఓ అరగంట యెనక్కొచ్చేయ్. అక్కడ కుడిచేతివేపు ఉంటది పంక్చను హాలు" అని దారి చూపించాడు. ఈసురోమంటూ వెనక్కొచ్చాడు బుల్లబ్బాయి.

ఆ పార్టీ హాలు బుల్లబ్బాయి వాళ్ళింటికి ఐదు నిమిషాల దూరంలో వుందని తెలిసింది. ఫోను పీక పిసికెయ్యాలని ట్రై చేసి, దాని పీక కనబడక ఊరుకున్నాడు బుల్లబ్బాయి. మెల్లిగా పార్టీ హాల్లోకొచ్చాడు. అక్కడ ఎవరూ తెలుగువాళ్ళలా కనబడలేదు. తప్పు పార్టీలోకి ఎంటరయ్యానేమో అని వెళిపోబోతుంటే ఒకాయనొచ్చి " వాట్ దూయూ వాంటింగ్ ?" అన్నాడు తెలుగులో.

"వాట్ పార్టీ ఈజ్ మూవింగ్ హియర్ ?" అన్నాడు బుల్లబ్బాయి.

"ఓహ్, మై డాటర్, బికమింగ్ బిగ్ వుమెన్, వోణీ సెర్మనీ, అండ్ మైసన్ వేరింగ్ బీచ్ టవల్ సెర్మనీ, కమాన్ జాయిన్" అనేసి చేతిలో మందు కప్పుతో ఎగురుకుంటూ వెళిపోయాడా శాల్తీ.

అతన్ని చూస్తూ ఓ స్థంభాన్ని గుద్దేసాడు బుల్లబ్బాయి. టేబుల్ టెన్నీసు బాలంత బొప్పి కట్టింది నెత్తి మీద. తడువుకుంటూ లేచాడు. ఆశ్చర్యం, తను గుద్దేసిన స్థంభం అక్కడ లేదు. అది మెల్లిగా కదిలి మరో పక్కకి వెళుతోంది. "అయ్యబాబోయ్, ఇదేవిటి, అవతార్ సినిమాలో ఎగిరే కొండల్లాగా, ఇక్కడ కదిలే స్థంభలున్నాయేవిటీ.." అనుకుంటూండగానే మరో స్థంభం అలా తన మీదనించి దాటబోతే వొడుపుగా తప్పించుకుని పక్కకి గెంతాడు.

ఇందాకటి శాల్తీ వచ్చి "సీ, దట్ ఈజ్ మై డాటర్, బికమింగ్ బిగ్ వుమెన్, వోణీ సెర్మనీ, మై సన్ దేర్, బికమింగ్ మేన్, బీచ్ టవల్ సెర్మనీ , ఏంజాయ్..." అనేసి తూలుకుంటూ ఇటు వెళ్ళి పోయాడు.

"రియల్లీ వెరీ బిగ్ వుమెన్" అనుకుంటూ ఆ కొడుకు కేసి చూసాడు. ఓ పదో క్లాసు కుఱ్ఱాడు కుర్చీలో కూచుని, ఫోనులో గేములాడుకుంటున్నాడు. వాడి ఫ్రెండ్స్ ఒక పది మంది వాడి చుట్టూ కూచుని అదేపని చేస్తున్నారు, ఇహ లోకంతో సంబంధం లేకుండా. ఇటు పక్క మరో పెద్ద కుర్చీ వేసి వుంది. సంసారపక్షంగా చెప్పాలంటే, ఓ చిన్న సైజు కుటుంబం, చింతలేని కుటుంబం మొత్తం కూర్చో వచ్చు ఆ సింహాసనంలో. కానీ అ డాటర్ బిగ్ వుమెన్ కి బొటా బొటీగా సరిపోతుంది. హాలంతా చీరలతో డెకరేట్ చేసేసారు. అన్ని రకాల చీరలు పోగెయ్యాలంటే, కనీసం నాలుగు షాపులకి కన్నం వెయ్యాలి. "బహుశా వెళ్ళేప్పుడు అందరికీ తలో చీరా ఇస్తారు కామోసు. మాయావిడికి చిలకాకుపచ్చ చీర అడగాలి" అనుకుంటూండగానే వచ్చిన పని గుర్తొచ్చి, మెల్లిగా స్టేజీ పక్కనున్న సౌండు సిస్టమ్ దగ్గరకెళ్ళాడు.

తొలిపాటగా "వాతాపి గణపతిం" అంటూ పెట్టాడు కంప్యూటర్ లో వెతికి.

అందరూ ఒక్క ఉదుటున పరిగెత్తుకొచ్చి మీద పడిపోయారు. "వాక్, వ్వాక్.." అనుకుంటూ అమాంతం ఆపాట ఆపేసారు.

ఇంతలో ఓ అగంతకుడు వాడి ఫోను తీసి తగిలించేసి " గణ నాయకా..." అంటూ వచ్చే పాటకి ఐదు నిమిషాలు అష్టవంకరలూ తిరిగి బ్రేక్ డాన్స్ చేసి, చప్పట్లు కొట్టించుకుని, ఓ మాటు తొండలాగ వంగి లేచి, ఒక చేత్తో దండం లాంటిది పెట్టి వెళ్ళి పోయాడు.

తరవాత తను గొంతు సవరించుకుని "నమో వెంకటేశా" అని ఏడుకొండలవాడిని స్మరించుకోబోయాడు బుల్లబ్బాయి. మళ్ళీ మైకు పీకేసి, " దేవ దేవ దేవుడా" అనే రికార్డు వేసేసి, ఓ పదిమంది అమ్మలు వీరంగం వేసేసారు. వాళ్ళ వస్త్ర ధారణ చూస్తే వాళ్ళందరికీ కలిపి పదేళ్ళకి మించి వుండవేమో అనిపించింది బుల్లబ్బాయికి. వీళ్ళంతా బిగ్ వుమెన్ ఎప్పుడవుతారో అని ఆలోచనలో పడ్డాడు. శకుంతల మార్కు రవికలు, వెనక కిటికీలున్న రవికలూ పోయి, అసలు వెనక వేపు రిబ్బను కటింగుకి పెట్టినట్టు ఓ పల్చని బేండు, చిన్న ముడి తప్ప, మరేమీ లేని రవికలని చూసి టెన్షన్ పడిపోయాడు బుల్లబ్బాయి. చేతులు కాళ్ళు వణకడం మొదలెట్టాయి.

ఇంతలో ఓ తిలోత్తమ సైదు స్టెప్పులేసుకుంటూ వచ్చి "పుట్ దట్ "గావు కేక" సాంగ్ మేన్, పీపుల్ వాన్నా డాన్స్" అంది మత్తుగా. ఆ పాటేవిటో తెలియక బిక్క చచ్చి పోయాడు బుల్లబ్బాయి.

ఇంతలో అ పాట దానంతట అదే వచ్చేసింది. నమ్మలేనట్టుగా వెనక్కి తిరిగి చూసాడు. అక్కడ అభయమిస్తూ బోసు డి.జె ఉన్నాడు. "హమ్మయ్య,వచ్చేసావా, నావల్ల కాట్లేదురా బాబూ.." అన్నాడు బుల్లబ్బాయి.

"ఏం భయం లేదెహె, నేను సూత్తాను గానీ, నువ్వెళ్ళి తినేసిరా.." అన్నాడు.

ఆడా మగా, పిల్లా జెల్లా, అంతా ఆ పాటకి స్టెప్పులేసేసారు. ఆనక కొన్ని దేశవాళీ కం విదేశవాళీ నాటు పాటలకి గెంతులూ, కాళ్ళూ చేతులూ కొట్టుకోవటాలు జరిగి, పిమ్మట కేకులు కోయు కార్యక్రమం, వోణీ, లుంగీ బహూకరణలు ముగించారు. అంతవరకూ బిక్కు బిక్కు మంటూ ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని, కాగితం బొచ్చెల్లో పెరుగు అన్నం తింటున్న అమ్మమ్మనీ, మామ్మని,

ఇద్దరు తాతల్నీ లాక్కొచ్చి ఓ మాటు ఫొటోలు పీకేసారు. ఆనక తంబోలా,రింబోలా, జింబోలా ఆటలూ ఆడించి, పిమ్మట డాన్సు ఫ్లోరు గేట్లు తెరిచేసారు. అంత వరకూ ఉగ్గబట్టుక్కూచ్చున తాగుబోతు జంటలన్నీ తూలుతూ గెంతులు మొదలెట్టారు. ఎవరో వెళ్ళి, ముసిలాళ్ళు నలుగురినీ ఎత్తుకొచ్చి మధ్యలో పడేసి, ఆత్మబలంలో జగ్గయ్య లాగ పెదాలు బిగదీసి "డాన్స్, వుయ్ సే డాన్స్.." అంటున్నారు. వాళ్ళు బిగిసిపోయిన శవాల్లాగా కొయ్య బారిపోయి నిల్చున్నారు. ఇల్లా కాదని ఒకరిద్దరు చొరవ తీసుకుని, వాళ్ళ కాళ్ళు తొక్కేసారు. వాళ్ళు నొప్పి తట్టుకోలేక వంకర్లు తిరిగితే, "నైస్ డేన్స్, నైస్ నైస్.." అంటూ మళ్ళీ వాళ్ళని తీసుకెళ్ళి ఎత్తి సీట్లలో కుదేసారు.

ఆ తరవాత ఎవరి ఇష్టం వాళ్ళది. ఎవరి వంకర్లు వాళ్ళవి. ఒకడికి మందెక్కువై రెండు చేతులూ పాము బూరాలాగ పెట్టి సన్నాయి ఊదుతున్నాడు మెడి కాళ్ళు వేసుకుని. దానికి అనుగుణంగా ఇంకోడి పెళ్ళాం రెండు అర చేతులూ పాము పడగలాగ చేసి నెత్తిన పెట్టి, మధ్య మధ్యలో నాలిక బైటికి లాగి, అంతలోనే మూసేసి, నాగిని లాగా వాడి ముందు మెలికలు తిరుగుతోంది. ఆవిడ మొగుడు ఓ కాలు పైకెత్తి మడత పెట్టి పంజాబీ నృత్యం చేస్తున్నాడు, చూపుడు వేళ్ళు పైకెట్టి. ఒకావిడ "మార్ డాలా" అంటూ అందరినీ, ఉత్తుత్తి కత్తులతో పొడిచి చంపేస్తోంది. వాళ్ళ టేస్టుకి తగ్గట్టుగా పాటలు మారుస్తూ, పాట పాటకీ సౌండు పెంచేస్తూ, ఘడియకో గ్లాసు తాగుతూ, ఆడా, మగా అందరితోటీ తలా ఒక స్టెప్పు వేస్తూ, ఫొటోలు దిగుతూ, అందరికీ కిర్రెక్కిస్తున్నాడు అలవాటు పడ్డ బోసు.

ఇంక అక్కడ వుండలేకపోయాడు బుల్లబ్బాయి.

బోసు దగ్గరకెళ్ళి "నే పోతారా బోసు. నా వల్ల కాదింక. ఏదో పాటలంటే వచ్చేహాను, యెదవది, ఇన్ని పాట్లుంటాయని తెలీదురా." అంటూంటే, బోసు

"థేంక్స్ బెదరూ, డిన్నర్ సేసి వెళ్ళు , నాకింకా టైమ్ పడుద్ది" అనేసి ఎవరో పిలిస్తే వెళిపోయాడు.

బతుకు జీవుడా అంటూ బుల్లబ్బాయి బయటపడబోతూంటే ఎనవున్సుమెంటు వినిపించింది "రింబోలా విన్నర్ బుల్లబ్బాయి విన్స్ గ్రీన్ శారీ" అంటూ.

పిల్లిలా వచ్చి ఆ చీర తీసుకుని, వెనక్కి చూడకుండా పరిగెత్తి కారెక్కి ఇల్లుచేరాడు బుల్లబ్బాయి.

COMMENTS